RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

Malkajgiri | Volume: 3 | Issue: 143 | Sunday, September 14, 2025 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/-

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 143 | ఆదివారం, సెప్టెంబర్ 14, 2025 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజిలు : 4 | వెల : రూ.4 /-

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్
నెంబర్: 99637 08331

### మహిళా సాధికారతకు పట్టం సుశీల కర్కి నియామకం..

# మోదీ ప్రశంసలు



**చురాచంద్‌పూర్:** నేపాల్ తొలి మహిళా ప్రధానమంత్రిగా నియమితులైన సుశీల కర్కి కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఆమె నియామకం మహిళా సాధికారతకు ఒక ఉజ్వల ఉదాహరణ అని అన్నారు. నేపాల్ భారత్‌కు సన్నిహిత దేశమని, 140 కోట్ల భారత ప్రజానీకం తరఫున ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నానని మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో మాట్లాడుతూ ప్రధాని అన్నారు. 'దేశ అత్యున్నత పదవిని కర్కి చేపట్టడం మహిళా సాధికారతకు బలమైన ఉదాహరణ. నేపాల్‌లో శాంతి, సుస్థిరత, అభ్యుదయానికి ఆమె పాటుపడతారని నేను బలంగా నమ్ముతున్నా' అని మోదీ అన్నారు. నేపాల్‌లో రాజకీయ సంక్షోభం, భారీ నిరసనల నేపథ్యంలో కర్కి నేపాల్ తాత్కాలిక ప్రధానిగా శుక్రవారం రాత్రి ప్రమాణస్వీకారం చేశారు. అవినీతి నిరోధక కార్యకర్తగా, నేపాల్ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా సుశీల కర్కి పేరు తెచ్చుకున్నారు. కాగా, నేపాల్ కొత్త ప్రధానిగా పగ్గాలు చేపట్టిన సుశీల కర్కిని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో శనివారం ఉదయం అభినందించారు. పొరుగుదేశాలతో శాంతి, ప్రగతి, ప్రజల అభ్యున్నతికి భారత్ కట్టుబడి ఉందని తెలిపారు.


### మణిపుర్ పేరులోనే మణి ఉంది..

# నేను మీతో ఉన్నా: మోడీ



**మణిపుర్:** భారీ వర్షాల వల్ల హెలికాప్టర్ లో రావడం సాధ్యపడలేదని భారత ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. రోడ్డు మార్గంలో మణిపుర్ కు వచ్చానని అన్నారు. మణిపుర్ లో మోడీ పర్యటించారు. మణిపుర్ లో అల్లర్ల బాధితులను పరామర్శించారు. ఇంపాల్, చురాచంద్ పుర్ లో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మణిపుర్ లో అల్లర్ల బాధిత కుటుంబాల చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మణిపుర్ బహిరంగ సభలో మాట్లాడారు. రోడ్డు మార్గంలో వచ్చేటప్పుడు తనకు మణిపూర్ వాసులు పలికిన స్వాగతం మర్చిపోలేనని, మువ్వెన్నల జెండాలు చేతబట్టి తనకు ఘనంగా స్వాగతం పలికారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. మణిపుర్ పేరులోనే మణి ఉందని అది దేశానికే మణి వంటిదని, మణిపుర్ దేశానికి ప్రకృతి ఇచ్చిన బహుమతి అని కొనియాడారు. మణిపుర్ ను వేగంగా ప్రగతి పథంలో పయనింపజేస్తాం అని మణిపుర్ కోసం రూ.7 వేల కోట్ల ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నామని తెలియజేశారు. మణిపుర్ ను దేశంతో అనుసంధానం చేసే ప్రాజెక్టులు చేపడుతున్నామని, రైలు, రోడ్డు మార్గాల కోసం మణిపుర్ కు నిధులు కేటాయిస్తున్నామని అన్నారు. రూ. 8 వేల కోట్లతో జాతీయ రహదారుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మణిపుర్ లో రైల్ కనెక్టివిటీ భారీగా పెంచుతున్నామని మోడి పేర్కొన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతుందని చెప్పారు. ప్రస్తుతం మణిపుర్ చేపడుతున్న ప్రాజెక్టులతో మౌలిక సదుపాయాలు, వైద్యసేవలు మెరుగవుతాయని, ఈశాన్య రాష్ట్రాల్లో దశాబ్దాలుగా అనేక వివాదాలు, ఉద్యమాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి నెలకొంటోందని, శాంతి స్థాపన ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని వెల్లడించారు. శాంతి స్థాపన ద్వారా తమ భావితరాల భవిష్యత్తు బావుంటుదని, మణిపుర్ ప్రజల వెంట భారత ప్రభుత్వం ఉందని మోడి స్పష్టం చేశారు.

# దేశాభివృద్ధిలో మిజోరం యువత భాగస్వామ్యం కావాలి: ప్రధాని మోడీ



**గ్యాంగ్‌టక్:** దేశాభివృద్ధిలో మిజోరం భాగస్వామ్యం కీలకమని ప్రధాని మోడీ తెలిపారు. కొండమార్గంలో రైలు మార్గం కష్టతరంలో కూడుకున్నదని, సవాల్‌తో కూడిన నిర్మాణాలు అద్భుతమని కొనియాడారు. మిజోరంలో రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టారు. వర్చువల్‌గా అభివృద్ధి పనులను పిఎం మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఈ రైల్వే లైన్లు భారతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానమవుతాయని, పర్యాటక రంగంతో ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉందని తెలియజేశారు. ఏ రాష్ట్రాభివృద్ధికైనా రోడ్డు, రైల్వే, పోరు కనెక్టివిటీ ముఖ్యమని స్పష్టం చేశారు. మిజోరం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, వేగవంతమైన దేశాభివృద్ధిలో మిజోరం యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మిజోరంలో రవాణా సౌకర్యాలు పెంచామని, నూతన రైళ్ల ప్రారంభోత్సవంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడుతాయని మోడీ వివరించారు. కష్టతరమైన కొండ ప్రాంతాల్లో రైల్వే సౌకర్యం సంతోషకరమైన విషయమన్నారు. ఇంజినీర్ల నైపుణ్యం, కార్మికుల స్ఫూర్తి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిందని ప్రశంసించారు. కఠినమైన భూభాగంతో అనేక సవాళ్లను అధిగమించి నిర్మాణం పూర్తి చేశారని మోడీ కొనియాడారు.



## ట్రైబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపిస్తాం: ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్:** తెలంగాణ జల ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. న్యాయంగా రావాల్సిన నీటివాటాను సాధిస్తాం అని అన్నారు. ఈ నెల 23 నుంచి కృష్ణా ట్రైబునల్ విచారణ దృష్ట్యా సమీక్షించారు. సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్, నీటి పారుదల రంగనిపుణులతో సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..811 టిఎంసిల కృష్ణా జలాల్లో 71 శాతం డిమాండ్ చేస్తున్నామని తెలియజేశారు. ట్రైబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపిస్తామని, తాగు, సాగునీటితో సహా పరిశ్రమలకు నీటి వినియోగానికి చర్యలు చేపడతామని అన్నారు. ట్రైబ్యునల్ విచారణ సమయంలో సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వచ్చి సమీక్షిస్తారని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# మహోద్ధృత ఉద్యమ రూపం సకల జనుల సమ్మె : కెటిఆర్



**హైదరాబాద్:** తెలంగాణ ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ఎంత బలంగా ఉందో చాటి చెప్పిన మహోద్ధృత ఉద్యమ రూపం సకల జనుల సమ్మె అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వ్యాఖ్యానించారు. సబ్బండ వర్గాల ప్రజలు ఏకమై, 42 రోజుల పాటు శాంతియుతంగా నిరసన తెలిపి, తెలంగాణ సెగను ఢిల్లీకి తాకేలా చేసిన మహోన్నత ఘట్టం సకల జనుల సమ్మె అని పేర్కొన్నారు. 2011 సెప్టెంబర్ 12 రోజున కరీంనగర్ జనగర్జనలో ఉద్యమ సారథి కెసిఆర్ పిలుపు మేరకు యావత్ తెలంగాణ సమాజం ఒక్కటయ్యిందని అన్నారు. సమ్మెలో స్వచ్ఛంధంగా భాగస్వాములయ్యి, ఔర్ ఏక్ ధక్కా.. తెలంగాణ పక్కా అని దిక్కులు పిక్కటిల్లేలా తెలంగాణ ప్రజలు నినదించారని గుర్తు చేశారు. నిర్బంధాలను ఛేదించి, ఆంక్షలకు ఎదురొడ్డి, బెదిరింపులను లెక్కచేయకుండా తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తెలంగాణ బిడ్డలు పోరాడారని పేర్కొన్నారు. సకల జనుల సమ్మెకు శనివారానికి(సెప్టెంబర్ 13కు) 14 ఏళ్ళు నిండిన సందర్భంగా.. సమ్మెలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి కెటిఆర్ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ, జై తెలంగాణ అంటూ ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం యావత్ తెలంగాణ ప్రజలు సింహాలై గర్జించిన రోజు నేడు, స్వరాష్ట్ర కాంక్షను సకల జనుల సమ్మె పేరిట ప్రపంచానికి చాటి చెప్పిన మహోజ్వల ఘట్టం నేడు అని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ హరీష్‌రావు పేర్కొన్నారు. సరిగ్గా 14 ఏండ్ల క్రితం ఇదే రోజున మొదలైన 'సకల జనుల సమ్మె' 42 రోజుల పాటు నిరవధికంగా కొనసాగిందని అన్నారు. కెసిఆర్ పిలుపుతో ప్రారంభమైన సమ్మె తెలంగాణ ఉద్యమ దిశను మలుపు తిప్పింది, స్వరాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటిందని వ్యాఖ్యానించారు. సకల జనుల సమ్మెకు ముందు రోజున, కరీంనగర్ 'జనగర్జన' సభలో కెసిఆర్ చేసిన ప్రసంగం చరిత్రాత్మకం అని చెప్పారు. 'సకల జనుల సమ్మెలో రేపటి నుంచి బస్సు పయ్య తిరగది, బడి గంట మోగది, సింగరేణిలో ఒక్క బొగ్గు పెల్ల కూడా పెగలదు, ఎక్కడ కూడా రైలు పోదు' అని ఇచ్చిన పిలుపు అన్ని వర్గాల ప్రజలను ఉత్తేజపరిచింది.. ఉద్యమ జ్వాలను రగిలించిందని అన్నారు. జై తెలంగాణ.. జై కెసిఆర్ అంటూ ట్వీట్ చేశారు.

# పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌ల విషయంలో భారత్ వైఖరి మారలేదు: అనురాగ్ ఠాకూర్



**న్యూఢిల్లీ:** ఆసియా కప్‌లో భాగంగా సెప్టెంబర్ 14న దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా టీమ్ ఇండియా పాకిస్థాన్‌తో తలపడనుండటంపై భారత అభిమానుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో దీనిపై బీజేపీ ఎంపీ, కేంద్ర క్రీడాశాఖ మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ వివరణ ఇచ్చారు. మల్టీనేషనల్ టోర్నమెంట్లలో పాకిస్థాన్‌తో భారత్ తలపడాల్సి వచ్చినా.. ఎట్టి పరిస్థితుల్లోనూ ద్వైపాక్షిక టోర్నమెంట్లు ఆడదని చెప్పారు. ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాల విషయంలో భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. టోర్నమెంట్ నిబంధనల ప్రకారంగానే మల్టీనేషనల్ టోర్నమెంట్లలో భారత్ పార్టిసిపేషన్ ఉంటుందని, అంతమాత్రాన దౌత్య, జాతీయ విధానాలను ఇండియా మార్చుకున్నట్టు కాదని అనురాగ్ ఠాకూర్ మీడియాతో శనివారం నాడు మాట్లాడుతూ చెప్పారు. 'మల్టీనేషనల్ టోర్నమెంట్లను ఏసీసీ కానీ ఐసీసీ కానీ నిర్వహించినప్పుడు ఆయా దేశాలు అందులో పాల్గొనడం తప్పనిసరి. అలా చేయకుంటే ఆ దేశాలను టోర్నమెంట్ నుంచి ఎలిమినేట్ చేస్తారు. అలాగే ప్రత్యర్థి జట్లకు పాయింట్లు జోడిస్తారు. అయితే పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లో పాల్గొనరాదని భారత్ చిరకాలంగా అనుసరిస్తున్న వైఖరికి కట్టుబడి ఉన్నాం' అని చెప్పారు. భారత్‌పై ఉగ్రదాడులు ఆపేంతవరకూ పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీస్ అడరాదనే నిర్ణయం చాలాకాలం క్రితమే తీసుకున్నట్టు అనురాగ్ ఠాకూర్ చెప్పారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో ఇండియా మ్యాచ్‌ను రద్దు చేయాలని విపక్ష ఏఐఎంఐఎం, శివసేన (యూబీటీ) తదితర పార్టీలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఠాకూర్ వివరణ ప్రాధాన్యత సంతరించుకుంది.

**రక్తం-క్రికెట్ కలిసి ప్రవహించవు**

భారత్-పాక్ మ్యాచ్‌పై శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడుతూ, ఆదివారం జరిగే మ్యాచ్‌కు వ్యతిరేకంగా తమ పార్టీ నిరసన తెలుపుతుందని చెప్పారు. 'రక్తం-క్రికెట్ కలిసి ప్రవహించవు' అని అన్నారు. పాక్‌తో భారత్ మ్యాచ్‌పై మహారాష్ట్ర కాంగ్రెస్ మండిపడింది. ఇది పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన కుటుంబాలు, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జవాన్లను అవమానించడమే అవుతుందని పేర్కొంది. మ్యాచ్‌కు అనుమతించడం కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ ప్రమాణాలకు అద్దం పడుతుందని ఎన్‌సీపీ(ఎస్‌పీ) చీఫ్ శరద్ పవార్ వ్యాఖ్యానించారు. ఇండియా-పాక్ మధ్య దుబాయ్‌లో సెప్టెంబర్ 14న జరిగే మ్యాచ్‌పై తాత్కాలిక స్టే ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణకు సుప్రీంకోర్టు గత గురువారం నాడు నిరాకరించింది.

### పార్టీ కేడర్‌తో సమావేశం...

# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు



**అమరావతి, సెప్టెంబర్ 13:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధి దిశగా.. సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందిస్తూ సుపరిపాలన సాగిస్తున్నామని అలాంటి వేళ ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించేందుకు కుట్రలు మొదలయ్యాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి కుట్రలకు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ జనసేన పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. శనివారం నాడు అమరావతిలోని పార్టీ కార్యాలయంలో జనసేన శ్రేణులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడారు. సామాజిక మాధ్యమాల ముసుగులోనో.. యూట్యూబ్ ఛానెళ్ల పేరుతోనో.. కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు పవన్ కల్యాణ్. ఇలా కుయుక్తులతో సమాజంలో అశాంతి, అభద్రత కలిగించే వ్యక్తుల నైజాన్ని గత పదేళ్లుగా చూస్తున్నామని వివరించారు. వారి ఉచ్చులో పడి ఆవేశాలకు లోనై, ఘర్షణ వాతావరణానికి తావీయ్యొద్దని పార్టీ శ్రేణులకు పవన్ హితవు పలికారు. అలాంటి ఆవేశాలు ప్రదర్శిస్తే కుట్రదారులు ఆశించిన ప్రయోజనాలు నెరవేరుతాయన్నారు. ఆ క్రమంలో ఇటీవల మచిలీపట్నంలో చోటు చేసుకున్న ఘటనను ఈ సందర్భంగా ఆయన ఉదాహరణగా వివరించారు. ఒక యూట్యూబ్ ఛానెల్‌లో వ్యక్తి అభ్యంతరకర భాష ఉపయోగించి మాట్లాడారని చెప్పారు. అతను ఆ విధంగా మాట్లాడేలా సిద్ధం చేసి.. ప్రచారం చేయడం వెనక ఉన్న ఆలోచనను మనం పసిగట్టాల్సి ఉందని పార్టీ శ్రేణులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. ఈ అంశంపై చట్ట ప్రకారం కేసులు పెట్టి ముందుకు వెళ్లాల్సి ఉందని సూచించారు. అంతేకానీ.. తొందరపడి మరో మార్గంలో వెళ్లి ఘర్షణ పడటం ద్వారా సమస్య జటిలం అవుతుందని అభిప్రాయపడ్డారు. కులాలు, మతాల మధ్య విభేదాలు తీసుకు వచ్చే విధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేయాల్సి ఉందంటూ పార్టీ శ్రేణులకు ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా ముందుకెళ్లాలని జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలతోపాటు కూమిటీలోని నేతలకు సీఎం పవన్ కల్యాణ్ వివరించారు.

# తెలంగాణ షాన్

## సంపాదకీయం

### వీడియో గేమ్స్ టెక్నాలజీ యువతకు వరమా...?

ఒక ఎలక్ట్రానిక్ దృశ్యశ్రవణ ఉపకరణ ఇన్‌పుట్ కంట్రోలర్‌ల ద్వారా వినియోగదారులు ఆడుకునే ఆసక్తికర అత్యాధునిక క్రీడను "వీడియో గేమ్" లేదా "వీడియో గేమింగ్" అని పులుస్తున్నాం. ఒక టీవీ సెట్, కంప్యూటర్ మానిటర్, హ్యాండ్‌హెల్డ్ పరికర డిస్ప్లే, టచ్ స్క్రీన్ ఉపకరణాలు లాంటి వేదికలే క్రీడా మైదానాలుగా డిజిటల్ మానవుడు ఆడుతున్న ఆధునిక ఆటను వీడియో గేమ్‌గా నేటి యువత అబ్బురపడుతూ ఆడుతున్నది. వినోదం, విరామం, కొత్త విషయాలు నేర్చుకోవడం, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం, సామాజిక అనుభవం, పోటీల కోసం యాక్షన్, అడ్వెంచర్, రోల్-ప్లేయింగ్ గేమ్‌ల వంటి వీడియో గేమ్స్ ఆడడం జరుగుతున్నది. వీడియో గేమ్ ఆడే వ్యక్తిని 'గేమర్' అని అంటాం. 1940ల్లో వీడియో గేమ్ ఆవిష్కరణలకు పునాదులు పడుతూ 1970ల్లో వాణిజ్యపరంగా అందుబాటులో రావడం, 1980లో వీడియో గేమ్స్ సామాన్యులకు సహితం అందుబాటులోకి రావడంతో నేటి పౌర సమాజంతో విడదీయరాని సంబంధాలను సుస్థిరం చేసుకున్నది ఈ మోడ్రన్ డిజిటల్ క్రీడ. చిన్నారుల నుంచి సీనియర్ సిటిజన్ల వరకు అన్ని వర్గాలను ఆకట్టుకుంటున్న అసంఖ్యాక వీడియో గేమింగ్ ప్రక్రియలు మారుమూల ప్రాంతాలకు సహితం విస్తరించడం జరిగింది. మైన్‌క్రాఫ్ట్, సూపర్ మారియో బ్రోస్, టెట్రిస్, ఫోర్ట్‌నైట్, ది లెజెండ్ ఆఫ్ జెల్డా లాంటి పలు ప్రఖ్యాత వీడియో గేమ్స్ నేడు మార్కెట్‌ను ముంచేస్తున్నాయి. వీడియో గేమ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, వీటి ప్రభావాలను వివరించడం, ఆవిష్కర్తలను గుర్తు చేసుకోవడం, వినోదంతో పాటు విశ్రాంతి/విరామాలకు దోహదపడడం, ఇతరులతో ఆన్‌లైన్‌లో కనెక్ట్ కావడం, టీమ్‌వర్క్‌ను పెంపొందించడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం లాంటి అంశాలను సవివరంగా చర్చించడానికి ప్రతి ఏట 12 సెప్టెంబర్ రోజున ప్రపంచ దేశాలు "జాతీయ వీడియో గేమ్స్ దినం" పాటించుట జరుగుతున్నది. మన ముని వేళ్లతో అద్భుత ఆనందాల మైదానంలో విహరింపజేస్తున్న వీడియో గేమింగ్ రోజురోజుకు కటింగ్-ఎడ్జ్ టెక్నాలజీతో కొత్తపుంతలు తొక్కుతున్నది. వీడియో గేమింగ్ డిజిటల్ క్రీడలతో పలు ప్రయోజనాలు ఉన్నప్పటికీ కొన్ని సందర్భాల్లో నష్టాలను కూడా నమోదు చేస్తున్నాయి. వీడియో గేమింగ్ వల్ల పలు వరాల లాంటి ప్రయోజనాలు కలుగుతున్నప్పటికీ హద్దులు మీరి మునిగితే పలు అనర్థాలు లేదా శాపాలను కూడా మూటకట్టుకోవలసి ఉంటుంది. వీడియో గేమ్స్ వల్ల వేగంగా స్పందించడం, కమ్యూనికేషన్-ఇంటర్‌పర్సనల్ స్కిల్స్ పెరగడం, చిన్న చిన్న విషయాలకు సహితం స్పందించడం, నాయకత్వ లక్షణాలు/జ్ఞాపకశక్తి పెరగడం, శ్రేయస్సుకు దోహదపడడం, సామాజిక బంధాలు బలపడడం, కొత్త భాషలు నేర్చుకోవడం, క్రిటికల్ థింకింగ్/ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు పెరగడం, ఏకాగ్రత పెరగడం లాంటి పలు ప్రయోజనాలు కలుగుతాయి. రోజుకు గంటల కొద్ది వీడియో గేమ్స్ ఆడిన వారిలో శారీరక హాని, సామాజిక ఒంటరితనం, శారీరక అనారోగ్యం, మానసిక సమస్యలు, ప్రవర్తనలో మార్పులు, ఆందోళన-అనవసర ఆవేశం పెరగడం, కంటి జబ్బులు, హద్దుమీరితే దురవాటుగా మారి పిల్లలు-యువత ఉజ్వల భవిష్యత్తుకు అడ్డుపడుతుంది. డిజిటల్-ఏఐ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న వేళ వీడియో గేమ్స్‌ను పరిమిత సమయం ఆడితే ఆనందంతో పాటు మానసిక ఉపశమనం కలుగుతాయి. రోజుకు 30 నిమిషాల కన్న ఎక్కువ సమయం ఆడడం మంచిది కాదు. పిల్లలు, యువత వీడియో గేమింగ్ టెక్నాలజీకి వ్యసనపరులు కాకుండా తల్లిదండ్రులు తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలి, ఏ గేమ్ ఆడుతున్నారు, ఎంత సేపు ఆడుతున్నారు అనే విషయాలను నిత్యం తెలుసుకుంటూ ఉండాలి. ఆధునిక టెక్నాలజీని మన ఆరోగ్యకర జీవనశైలిని బలపరిచే విధంగా వాడుతూ ఉండాలి. ప్రతి రోజు మైదాన క్రీడలకు లేదా వ్యాయామ క్రీడలకు, పాఠశాల హోమ్‌వర్క్ చేయడానికి ప్రాధాన్యం ఇవ్వడం కూడా మరిచి పోరాదు.వినోదం, విరామం, కొత్త విషయాలు నేర్చుకోవడం, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం, సామాజిక అనుభవం, పోటీల కోసం యాక్షన్, అడ్వెంచర్, రోల్-ప్లేయింగ్ గేమ్‌ల వంటి వీడియో గేమ్స్ ఆడడం జరుగుతున్నది. వీడియో గేమ్ ఆడే వ్యక్తిని 'గేమర్' అని అంటాం. 1940ల్లో వీడియో గేమ్ ఆవిష్కరణలకు పునాదులు పడుతూ 1970ల్లో వాణిజ్యపరంగా అందుబాటులో రావడం, 1980లో వీడియో గేమ్స్ సామాన్యులకు సహితం అందుబాటులోకి రావడంతో నేటి పౌర సమాజంతో విడదీయరాని సంబంధాలను సుస్థిరం చేసుకున్నది ఈ మోడ్రన్ డిజిటల్ క్రీడ. చిన్నారుల నుంచి సీనియర్ సిటిజన్ల వరకు అన్ని వర్గాలను ఆకట్టుకుంటున్న అసంఖ్యాక వీడియో గేమింగ్ ప్రక్రియలు మారుమూల ప్రాంతాలకు సహితం విస్తరించడం జరిగింది. మైన్‌క్రాఫ్ట్, సూపర్ మారియో బ్రోస్, టెట్రిస్, ఫోర్ట్‌నైట్, ది లెజెండ్ ఆఫ్ జెల్డా లాంటి పలు ప్రఖ్యాత వీడియో గేమ్స్ నేడు మార్కెట్‌ను ముంచేస్తున్నాయి. వీడియో గేమ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, వీటి ప్రభావాలను వివరించడం, ఆవిష్కర్తలను గుర్తు చేసుకోవడం, వినోదంతో పాటు విశ్రాంతి/విరామాలకు దోహదపడడం, ఇతరులతో ఆన్‌లైన్‌లో కనెక్ట్ కావడం, టీమ్‌వర్క్‌ను పెంపొందించడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం లాంటి అంశాలను సవివరంగా చర్చించడానికి ప్రతి ఏట 12 సెప్టెంబర్ రోజున ప్రపంచ దేశాలు "జాతీయ వీడియో గేమ్స్ దినం" పాటించుట జరుగుతున్నది. మన ముని వేళ్లతో అద్భుత ఆనందాల మైదానంలో విహరింపజేస్తున్న వీడియో గేమింగ్ రోజురోజుకు కటింగ్-ఎడ్జ్ టెక్నాలజీతో కొత్తపుంతలు తొక్కుతున్నది. ఏదైనా అతిగా వాడితే అనర్థమే అని తెలుసుకొని అన్ని రకాల ప్రక్రియలకు పరిమితసమయాలను కేటాయించుకుంటూ డిజిటల్-ఏఐ నరుడిగా ముందుకు సాగాలి. టెక్నాలజీని మానసిక-శారీరక ఆరోగ్యానికి అవసరం మేరకు వాడుకుంటూ స్మార్ట్ నరుడిగా రుజువు చేసుకోవాలి.

# దేశవ్యాప్తంగా ఐఎఫ్ డబ్ల్యూజే ను బలోపేతం చేద్దాం

-సమస్యలపై సమిష్టిగా పోరాడదాం

-జాతీయ సమావేశాల్లో వక్తల పిలుపు జోధ్ పూర్ లో ముగిసిన జాతీయ సమావేశాలు






జోధ్ పూర్/రాజస్థాన్,సెప్టెంబర్ 13: తెలంగాణ షాన్ ప్రతినిధి జెమినీ నాగరాజు గౌడ్

జర్నలిస్టుల హక్కుల ఉద్యమంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే)ను దేశవ్యాప్తంగా బలోపేతం చేసి జర్నలిస్టుల సమస్యలపై సమిష్టి పోరాటం చేయాలని ఆ సంఘం జాతీయ సమావేశాల్లో పలువురు నేతలు పిలుపునిచ్చారు. రాజస్థాన్ లోని జోధ్ పూర్ లో జరిగిన ఐఎఫ్ డబ్ల్యూజే మూడు రోజుల జాతీయ సమావేశాలు శనివారం ముగిసాయి. మూడు రోజుల పాటు ఉత్సాహభరితంగా జరిగిన ఈ మహాసభల్లో దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల నుంచి 500 మంది ప్రతినిధులు, ఐఎఫ్ డబ్ల్యూజే నాయకులు పాల్గొన్నారు. జర్నలిస్టుల వేజ్ బోర్డు, సీనియర్ జర్నలిస్టుల పెన్షన్ స్కీం, రైల్వే రాయితీ పాస్, జర్నలిస్టుల రక్షణ చట్టం తదితర అంశాలతో పాటు ఆయా రాష్ట్రాల జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న ఆయా సమస్యల సాధనకై జాతీయ స్థాయిలో కార్యాచరణ రూపొందించాలని సమావేశంలో పలు రాష్ట్రాల నేతలు అన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు.తెలంగాణలో పాలకుల నిర్లక్ష్యం చేస్తున్నారు ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ సమావేశాల్లో తెలంగాణ జర్నలిస్టుల సమస్యలు ప్రస్తావనకు వచ్చాయి. ఐఎఫ్ డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలు సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్నాయని, గత ప్రభుత్వం జర్నలిస్టులను పూర్తిగా విస్మరించిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా సమస్యలు పరిష్కరించకుండా జాప్యం చేస్తుందని అన్నారు. ఒకవైపు జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత, భౌతిక రక్షణ లేదని, మీడియా సంస్థల్లో 80 శాతం జర్నలిస్టులకు వేతనాలు లేవని అన్నారు. యాజమాన్యాలు, ప్రభుత్వాలు జర్నలిస్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. తమ రాష్ట్రంలో కొన్ని జర్నలిస్టు సంఘాలు అధికార పదవుల కోసం ప్రభుత్వాలకు తలొగ్గి జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు కావస్తున్నా, జర్నలిస్టుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కరించలేదని, కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులివ్వలేదని అన్నారు. అక్రెడిటేషన్ విషయంలో చిన్న మధ్య తరహా పత్రికలకు అన్యాయం చేసే విధంగా కొత్త జీవో తీసుకురాబోతున్నారని ఆయన తెలిపారు. తమ రాష్ట్రంలో జర్నలిస్టులకు ఎలాంటి నష్టం జరిగినా తమ సంఘం ఊరుకోదని మామిడి సోమయ్య హెచ్చరించారు. ముగింపు సమావేశంలో రాజస్థాన్ రాష్ట్ర మంత్రి కె.కె. విష్ణోయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జాతీయ ఉపాధ్యక్షుడు ఉపేంద్ర సింగ్ రాథోడ్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశాల్లో ప్రత్యేక అతిథులుగా పోకరన్ ఎమ్మెల్యే మహంత్ ప్రతాప్ పూరి, జోధ్‌పూర్ మేయర్ వనితా సేథ్, బిజెపి నగర అధ్యక్షుడు రాజేంద్ర పలివాల్, పోలీస్ కమిషనర్ ఓంప్రకాష్ పాశ్వాన్, జిల్లా కలెక్టర్ గౌరవ్ అగర్వాల్, జిల్లా మండలి సిఇఒ ఆశిష్ మిశ్రా, సాధ్వి ప్రీతి ప్రియవంద, మాజీ ఎమ్మెల్యే మనీషా పన్వర్, మార్వాడ్ రాజ్‌పుత్ సభ అధ్యక్షుడు హనుమాన్ సింగ్ ఖంగ్తా, సీనియర్ జర్నలిస్టులు ఆయేషా ఖనం, అమిత్ భట్, ఐఎఫ్‌డబ్ల్యుజె జాతీయ ప్రధాన కార్యదర్శి విపిన్ ధులియా, కార్యదర్శులు విశ్వదేవ్ రావు, పులిపలుపుల ఆనందం, శాంతకుమారి, కోశాధికారి మోహన్ కుమార్, రజత్ మిశ్రా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు వల్లాల జగన్, బండి విజయ్ కుమార్,జాతీయ కౌన్సిల్ సభ్యులు కుడితాడు బాపురావు, కంతేటి రమాదేవి, సీనియర్ జర్నలిస్టులు పంతాటి రవీందర్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ అధ్యక్షుని అభ్యర్థనకు సానుకూల స్పందన



కాప్రా సెప్టెంబర్ 13

నాగార్జున నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు యావపురం రవి విజ్ఞప్తి మేరకు జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ శనివారం కాలనీని సందర్శించారు.. కమిటీ అభ్యర్థన మేరకు మెయిన్ రోడ్ లో ఏర్పాటు చేసిన మినీ డంపింగ్ యార్డును వేరే చోటుకు మార్చాలని జిహెచ్‌ఎంసి జవాన్ రాజన్ కి సూచించారు. నాగార్జున నగర్ కాలనీ బస్ స్టాప్ ఏర్పాటుకు సహకరిస్తానని తెలిపారు..కాన్స్టెన్సీ డెవలప్మెంట్ నిధులలోంచి మంజూరైన నాగార్జున నగర్ కాలనీ అంతర్గత రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. 300 మీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు సాంక్షన్ అయ్యి పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు.. కాలనీ అంతర్గత రోడ్లలో ఏర్పడ్డ పాట్ హోల్స్ లో ప్యాచ్ వర్క్ చేయించాలని ఏఈ అభిషేక్ కు సూచించారు.. కాలనీలోని ఆరు ప్రధాన రోడ్ల ఎంట్రన్స్ లలో స్ట్రీట్ లైట్లు అమర్చాలని జిహెచ్‌ఎంసి ఎలక్ట్రికల్ విభాగం అధికారులకు సూచించారు.. అదేవిధంగా కాలనీలోని పార్కు డెవలప్మెంట్ విషయమై చట్టపరమైన సాధ్యాసాధ్యాలను అధికారుల నుంచి సమాచారం సేకరించి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు గోపాల్ యాదవ్ కార్యనిర్వహణ కార్యదర్శి వెంకటేష్ గౌడ్, నాయకులు ప్రకాష్ రెడ్డి, ఉదయ్ చారి, ఈరయ్య యాదవ్, మున్ని, అరుణ, నిర్మల, నవనీత, రమాదేవి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.


# విద్యార్థుల్లోని అజ్ఞానాన్ని తొలగించి సన్మార్గం చూపించే దైవం గురువు:ఎమ్మెల్యే కెపి.వివేకానంద్






కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 13 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజ్ గౌడ్

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిన్న సాయంత్రం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల నందు కుత్బుల్లాపూర్ మండల్ రికగ్నిస్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (%QMRSMA%)ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్ కరెస్పాండెంట్స్ అవార్డ్ సెరెమొని 2025 వేడుకల కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభోత్సవంగావించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమాజంలో బాలికల విద్యా ప్రాముఖ్యతతో పాటు పలు అంశాలపై చిన్నారులు చేసిన నాటకాలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.అనంతరం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.... విద్యార్థుల్లోని అజ్ఞానాన్ని తొలగించి సన్మార్గం చూపించే దైవం గురువు అని అన్నారు. గురువులను సత్కరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ కరెస్పాండెంట్లను ఎమ్మెల్యే వారి చేతులమీదుగా సత్కరించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ని కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంఈవో రమేష్, %QMRSMA% అధ్యక్షులు శివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.మల్లేశం, ప్రెసిడెంట్ మహేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి రవి కుమార్, కోశాధికారి గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు అల్తాఫ్ హుస్సేన్, మాజీ వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# యజ్ఞ మహోత్సవానికి మేడ్చల్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, వాణి శ్రీకాంత్ రాజ్ కు విశ్వబ్రాహ్మణ సంఘం ఆహ్వానం






జవహర్ నగర్: తెలంగాణ షాన్, సెప్టెంబర్ 13:

మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ మరియు ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ వాణి శ్రీకాంత్ రాజ్ లను జవహర్ నగర్ శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సంఘం జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, సెప్టెంబర్ 17న జరగనున్న యజ్ఞ మహోత్సవానికి ఆహ్వానించారు.?జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కమ్యూనిటీ హాల్‌లో జరగబోయే ఈ కార్యక్రమం కోసం యజ్ఞ కమిటీ ఆహ్వాన పత్రికను వారి గృహంలో అందించింది. ఈ సందర్భంగా యజ్ఞ మహోత్సవం ప్రాముఖ్యత మరియు ఏర్పాట్ల గురించి నాయకులు వారికి వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు.

?ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రహ్మణ మను మయ సంఘం ప్రధాన కార్యదర్శి తాటికొండ శ్రీరాములు చారి, విశ్వబ్రహ్మణ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షులు బాషపల్లి రమేష్ చారి, మనుమయ సంఘం జిల్లా అధ్యక్షులు దయాకర్ చారి, జేఏసీ అధ్యక్షులు మారోజు సోమాచారి, ప్రధాన కార్యదర్శి కేకే చారి, యజ్ఞ కమిటీ అధ్యక్షులు శ్రీరామదాసు వెంకటరమణాచారి, కోశాధికారి ఆకునూరి నగేష్ చారి, ఉపాధ్యక్షులు మారోజు రమేష్ బాబు, బి తోజు రామాచారి, కార్యదర్శి వగులోజు నవీన్ చారి, శ్రీరామోజు వెంకటాచారి, సలహాదారులు గాలయ్య చారి, కాసోజు యకచారి, ప్రచార కార్యదర్శి కాయతోజు సత్యం చారి సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

-ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం




ఖమ్మం సెప్టెంబర్ 13:

రాజీ మార్గమే రాజా మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు లోని న్యాయ సేవా సదన్ లో జాతీయ లోక్ అదాలత్ ను జిల్లా ప్రిన్సిపల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, లోక్ అదాలత్ లో రాజీతో ఇరువర్గాలు గెలిచినట్లేనని, లోక్ అదాలత్ తీర్పు, సుప్రీంకోర్ట్ తుది తీర్పుతో సమానమని అన్నారు. లోక్ అదాలత్ లను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలని అన్నారు. రాజీ మార్గంలో కక్షిదారులు లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకొని తమ కేసులను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. కేసులను రాజీతో ముగించేందుకు ఇలాంటి లోక్ అదాలత్ లు ఉపయోగ పడతాయన్నారు. ఎలాంటి ఫీజు లేకుండా న్యాయ సేవా సంస్థ సహకారంతో కేసులను పూర్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు కేసులు రాజీ చేసుకోవడం ద్వారా అప్పీలు చేసుకోవడం ఉండదని, కోర్టు చుట్టూ తిరిగితే సమయం, డబ్బు వృధా అవుతుందని, కేసుల పరిష్కారంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కేసుల సత్వర పరిష్కారంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దామని అన్నారు. కుటుంబ వివాదాల కేసులలో ముఖ్యమైనవి భార్యాభర్తల కేసుల వివాదాలలో ఇద్దరు కలిసి ఉంటే, వారి సంతానంతో పాటు ఇరువర్గాల కుటుంబాలు కూడా సుఖ సంతోషాలతో ఉండి, ఆరోగ్యమైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు జిల్లాలో 4746 కేసులను గుర్తించి, ఇప్పటికే 502 కేసులు పరిష్కరించగా, గత లోక్ అదాలత్ లో 19849 కేసులను పరిష్కరించినట్లు ప్రధాన నాయమూర్తి తెలిపారు. ప్రస్తుత లోక్ అదాలత్ లో 597 కేసుల పరిష్కారం అవనున్నట్లు అన్నారు. భాగస్వాములందరూ లక్ష్య సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదం, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు, ఇతర రాజీపడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసుల పరిష్కారంతో కక్షిదారుల మధ్య సుహృద్భావ వాతావరణం తో పాటు, గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ లో ఒకరు గెలవడం, ఒకరు ఓడడం ఉండదని, ఇద్దరు విజేతలేనని ప్రధాన న్యాయమూర్తి అన్నారు కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొండపు వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, భవిష్యత్తులో న్యాయ సేవాధికార సంస్థ సేవలు జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో తీసుకెళ్లడానికి బార్ అసోసియేషన్ పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు.

# కవితకు అండగా కేసీఆర్...



**హైదరాబాద్ :** ఆడబిడ్డ ఏడిస్తే ఇంటికి మంచిది కాదు అంటారు. తెలంగాణ సమాజం ఈ సామెతను బలంగా నమ్ముతుంది. ఆడబిడ్డను సాక్షాత్తు ఇంటి దేవతగా కొలుస్తూ ఉంటుంది. ప్రతి పండుగకు చీరె సారే పెడుతూ గౌరవించుకుంటుంది. దీనికి ఏ కుటుంబం కూడా మినహాయింపు కాదు. తెలంగాణ అంటేనే ఒక బలమైన అస్తిత్వానికి ప్రతీక. అందువల్లే ఇక్కడ చాలా దృఢమైన ఉద్యమాలు పుట్టాయి. ఆ ఉద్యమాలలో ఆడవారి పాత్రను బలంగా నిలుపుకున్నాయి. సమ్మక్క సారలమ్మ.. రుద్రమదేవి.. చాకలి ఐలమ్మ.. ఇలా చెప్పుకుంటూ పోతే వీరవనితలు.. ధీర వనితలు చాలామంది ఉన్నారు. వారందరూ ఇప్పటికీ కూడా ప్రజల మదిలో మెదులుతున్నారు. తెలంగాణ సమాజం తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ వనితలను మననం చేసుకుంటూ ముందుకు సాగింది. తమ స్వీయ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ అడుగులు వేసింది. అలా అడుగులు వేసిన వారిలో కల్వకుంట్ల కవిత కూడా ఒకరు.తెలంగాణ ఉద్యమ సమయంలో.. తెలంగాణకు అస్తిత్వం అయిన బతుకమ్మను నెత్తిన పెట్టుకుని ఆమె చేసిన సాంస్కృతిక ఉద్యమం మామూలుది కాదు. తెలంగాణ ఆడబిడ్డల్ని ఉద్యమంలో మమేకం చేయడానికి ఆమె ఎత్తుకున్న బతుకమ్మ ఎంతో మందిని కదిలించింది. కదిలి వచ్చేలా చేసింది. తెలంగాణ సాంస్కృతి.. తెలంగాణ సంప్రదాయం అంటేనే బూతు లాగా ధ్వనించిన ఒక సందర్భంలో.. బతుకమ్మ ద్వారా వాటన్నింటిని పటాపంచలు చేసింది కవిత. అందువల్లే ఆమె తెలంగాణ బతుకమ్మగా పేరుపొందింది. ఎంగిలి పూల నుంచి మొదలుపెడితే సద్దుల బతుకమ్మ వరకు ఆమె అడుగు పెట్టని ఊరంటూ లేదు. గౌరమ్మను నిలుపుకోవడం.. తంగేడు పూలతో బతుకమ్మను పేర్చడం.. పాటలు పాడి చెరువులో నిమజ్జనం చేయడం.. ఇదే క్రతువుగా సాగిపోయింది కవిత. అటువంటి బతుకమ్మకు నేడు కష్టం వచ్చింది. పుట్టిన ఇంటి నుంచి ఇబ్బందికరమైన వాతావరణం ఎదురైంది. పండగపూట ఏ ఆడబిడ్డకు ఇటువంటి కష్టం రావద్దు. ఇటువంటి ఇబ్బంది అసలు రావద్దు. పున్నమి 15 రోజుల్లో వెలుగు వెలిగే చంద్రుడు కూడా.. అమావాస్య రోజులలో మసకబారతాడు. అలాగని ఎప్పటికీ చీకట్లో ఉండిపోడు. ఇప్పుడు కవిత పరిస్థితి కూడా అలాంటిదే. తాత్కాలికంగా ఆమె ప్రభ కొంతమేర ఇబ్బందికి గురైనప్పటికీ.. ఆ తర్వాతి రోజుల్లో దీపశిఖలాగా వెలుగుతూనే ఉంటుంది. కర్మ సిద్ధాంతాన్ని బలంగా నమ్మే ఆమె.. ఎట్టి పరిస్థితుల్లోనూ తన ప్రభను కోల్పోరు.పుట్టినింటి నుంచి కాస్త ఇబ్బంది ఎదురవుతున్నప్పటికీ.. మేమున్నామంటూ పుట్టిన గడ్డవాళ్ళు కవిత దగ్గరికి వచ్చారు. కెసిఆర్ స్వగ్రామం చింతమడక గ్రామస్తులు తెలంగాణ బతుకమ్మ దగ్గరికి స్వయంగా వచ్చి ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో భాగస్వామి కావాలని స్వాగతం పలికారు. చీర, సారె, పసుపు కుంకుమలతో సాదర ఆహ్వానం పలికారు. ఒక ఆడబిడ్డకు ఇంతకంటే కావలసిందేముంది. పండగ పూట ఇంతకంటే ఘనమైన ఆతిథ్యం ఇంకొకటి ఏమంటుంది. ఇది తెలంగాణ బతుకమ్మకు దక్కిన నిండైన గౌరవం. కెసిఆర్ కుమార్తెకు కెసిఆర్ స్వగ్రామం నుంచి లభించిన గొప్పదైన సత్కారం. ఇప్పుడు కవిత మనసు చాలా తేలికైంది. గుండెలో భారం తగ్గిపోయింది. ఎందుకంటే తెలంగాణ బతుకమ్మ దగ్గరికి బతుకమ్మ వడివడిగా అడుగులు వేసుకుంటూ వచ్చింది కాబట్టి..

# ఇండియా కు ట్రంప్



ముంబై : భారత్‌పై సుంకాలతో ఒకవైపు విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్ వాటిని లెక్క చేయకపోవడంతో ఇప్పుడు దిగివస్తున్నారు. ప్రధాని మోదీతో మాట్లాడతానని సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల సముదాయం అయిన క్వాడ్ సదస్సు ఈ ఏడాది నవంబర్‌లో ఢిల్లీలో జరగనుంది. ఈ సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరు కావడంపై మొదట్లో ఆసక్తికరమైన చర్చలు జరిగాయి. తాజా ఉద్రిక్తతలు, యూఎస్ అంబాసిడర్ సెర్గీ గోర్‌ల చర్చలు మొదలైనప్పటికీ సమ్మిట్‌కు ట్రంప్ రాకపోవచ్చని తెలుస్తోంది.యూఎస్ అంబాసిడర్ టు ఇండియా సెర్గీ గోర్, ట్రంప్ ఈ సమ్మిట్‌కు చాలా ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇది భారత్‌తో అమెరికా సంబంధాల్లో బలమైన ఆసక్తిని సూచించింది. మొదట్లో, ట్రంప్ జూన్‌లో మోదీ ఆహ్వానాన్ని అంగీకరించినట్లు ప్రకటించారు. ఇది ఇండో?పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రభావాన్ని అరికట్టడానికి క్వాడ్‌లో అమెరికా కట్టుబాటును బలపరచడానికి సహాయపడుతుందని భావించబడింది. ఈ సమ్మిట్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా, జపాన్ నేతతోపాటు ట్రంప్ చర్చలు జరిగితే, ఆర్థిక, రక్షణ, సాంకేతికతా సహకారాలు మరింత బలపడతాయని అంచనా.ఇటీవలి నెలల్లో పరిస్థితులు మారాయి. న్యూయార్క్ టైమ్స్ వంటి మీడియా రిపోర్టుల ప్రకారం, ట్రంప్ ఇండియా సందర్శనను రద్దు చేసి ఉండవచ్చు. ఇందుకు ప్రధాన కారణాలు ట్రంప్?మోదీ మధ్య ఏర్పడిన ఉద్రిక్తతలు. ట్రంప్, ఇండియా?పాకిస్తాన్ యుద్ధాన్ని తాను 'పరిష్కరించాను' అని పదేపదే ప్రకటించడం మోదీని కోపోద్రేకంచేసింది. ఇది ట్రంప్ నోబెల్ శాంతి బహుమతికి మోదీ మద్దతు కోరుకోవడంతో మరింత తీవ్రమైంది. జూన్ 17న జరిగిన 35 నిమిషాల ఫోన్ కాల్‌లో మోదీ, అమెరికా జోక్యం ఏమీ లేదని స్పష్టం చేశారు. ఇలా రెండు నేతల మధ్య విశ్వాసం దెబ్బతినడంతో, ట్రంప్ ఇప్పుడు నవంబర్ సమ్మిట్‌కు రాకపోవచ్చని సమాచారం.తాజాగా ట్రంప్ వైఖరిలో మార్పు కనిపిస్తోంది. భారత్‌ను దూరం చేసుకోవడంతో అమెరికాకే నష్టం అని ఆర్థిక వేత్తలు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ భారత్‌తో సయోధ్యకు సై అంటున్నారు. ఇందుకు మోదీ కూడా సానుకూలంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో క్వాడ్ సమావేశంలో ఇద్దరూ భేటీ కావడం ద్వారా చైనాకు చెక్ పెట్టడంతోపాటు భారత్?అమెరికా సంబంధాలు పునరుద్ధరించే అవకాశం ఉంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అందుకే ట్రంప్ భారత్‌కు వస్తారని అంచనా వేస్తునానరు. ట్రంప్ రాకపోతే, క్వాడ్ సమ్మిట్ పూర్తి స్థాయిలో జరగకపోవచ్చు. అమెరికా?భారత వాణిజ్య చర్చలు ఆగిపోవచ్చు

# బరితెగిస్తున్న లీడర్లు...

**నల్గోండ :** సడుకుంటేనే పని జరుగుతుంది.. వారానికి రెండుసార్లు వస్తే చాలుశీర్షిక చదివి మమ్మల్ని తిట్టుకుంటున్నారు కదూ. మీ స్థానంలో మేము ఉంటే అలాగే తిట్టుకునే వాళ్ళం. కనబడితే రెండు చెంపలు వాయించే వాళ్ళం కూడా. ఎందుకంటే ఆ శీర్షిక అలా ఉంది కాబట్టి. వాస్తవానికి ఈ తరహా భాషను ప్రయోగించాలంటే మాకు కూడా చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఎందుకంటే మా న్యూస్ వెబ్సైట్ ను అందరూ చూడాలనేదే తాపత్రయం. అంటే తప్ప ఒక సెక్షన్ రీడర్స్ చదవాలనేది కాదు. కాకపోతే జరిగిన దారుణం అటువంటిది. ఇటువంటి దారుణాన్ని వెలుగులోకి తీసుకొచ్చే క్రమంలో ఆ తరహా భాష వాడక తప్పడం లేదు. పెద్ద మనసుతో క్షమిస్తారని కోరుకుంటున్నాం. ప్రభుత్వ పథకాలు పేదలకు అందాలని ఏలుతున్న నాయకులు చెబుతుంటారు. పెద్దపెద్ద సమావేశాలు పెట్టి మరి గొప్పగా వ్యాఖ్యానిస్తూ ఉంటారు. వాస్తవానికి ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం పేదవాడికి చేరితే అంతకుమించిన ఆనందం ఇంకొకటి ఉండదు. ఎందుకంటే పథకం అనేది పేదవాళ్లకు చేరినప్పుడు క్రమక్రమంగా పేదరికం తగ్గిపోతుంది. తద్వారా జీవించే హక్కు.. అందరికీ సమానంగా ఉంటుంది. ఒకరి మీద ఆధారపడకుండా స్వశక్తితో బతికే వారి సంఖ్య పెరుగుతుంది. అంతకు మించిన ఆనందం ఇంకెక్కడ ఉంటుంది. పైగా పథకాలను పకడ్బందీగా ప్రభుత్వాలు అమలు చేస్తే.. వాళ్ల అధికారానికి ఇబ్బంది ఉండదు. కానీ మన ప్రభుత్వాలు అలా చేయవు కదా. పథకాల విషయంలో అధికార పార్టీ నేతల నొక్కుడు ఎక్కువగా ఉంటుంది కదా. పైగా అధికార పార్టీ నేతలకు పేటెంట్ రైట్ మాదిరిగా ప్రభుత్వ పథకాలు ఉంటాయి కదా.. పైగా ఇలాంటి వ్యవహారాలలో ఏ వ్యవస్థలు జోక్యం చేసుకోలేవు. జస్ట్ చూస్తూ ఉంటాయి.పేదలకు పథకాలు కావాలి కాబట్టి నేతల చుట్టూ తిరుగుతూ ఉంటారు. ఆ అధికార పార్టీలో ఉన్న నాయకులు పేదల అవకాశాన్ని ఆసరాగా చేసుకొని రకరకాల వ్యవహారాలకు పాల్పడుతుంటారు. అయితే తెలంగాణలోని ఓ ప్రాంతంలో ఓ ప్రభుత్వ పథకానికి సంబంధించి ఓ మహిళ అధికార పార్టీ నాయకుడిని కలిసింది. మొదట్లో కచ్చితంగా



చేస్తానని హామీ ఇచ్చిన అతడు.. ఆ తర్వాత ఆమెను అనేక పర్యాయాలు తన వద్దకు రప్పించుకున్నాడు. వచ్చిన ప్రతి సందర్భంలో ఆమె అందం అతడిని భూమి మీద నిలువనీయకుండా చేసేది. దీంతో అతడు ఆమె అందాన్ని సొంతం చేసుకోవాలని అనుకున్నాడు. ఇందులో భాగంగానే ఆమె ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. ఇక అప్పటినుంచి అసలు కథ మొదలుపెట్టాడు.తన వద్దకు రావాలని.. మల్లెపూలు పెట్టుకోవాలని.. అందంగా తయారు కావాలని.. వారానికి రెండుసార్లు వచ్చిపోతే సరిపోతుందని.. డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వ పథకమే కాదు ఇంకా చాలా అందుతాయని ఆఫరించాడు. దీంతో ఆమె భయపడిపోయింది. ఇలాంటిది తప్పని చెప్పింది. అయినప్పటికీ అతడు వినిపించుకోలేదు. దీనికి తోడు మరింత దూకుడుగా వెళ్లడం మొదలుపెట్టాడు.. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె ఒప్పుకుంది. అయితే అతని బాగోతాన్ని మొత్తం ఫోన్లో రికార్డ్ చేసింది. అది కాస్త సోషల్ మీడియాలోకి ఎక్కడంతో ఒక్కసారిగా సంచలనం నమోదయింది.ఇక్కడ పేర్లు బయట పెట్టవచ్చు. ప్రాంతాలతో సహా వెల్లడించవచ్చు. లీగల్ గా ఇబ్బంది అవుతుంది కాబట్టే ఆ వివరాలు బయట పెట్టడం లేదు. సాధారణంగా అధికార పార్టీ అనగానే కార్యకర్తలకు కొమ్ములు ఉండవు. నాయకులకు పేటెంట్ రైట్స్ ఉండవు. అధికారమనేది కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత మారిపోతూ ఉంటుంది. కానీ ఇటువంటి నాయకులు అధికార పార్టీలో ఉంటే మాత్రం అధికారం ఐదేళ్లు కాదు కదా.. ఐదు నిమిషాలు కూడా ఉండదు.

# ఆలయాల సందర్శనకు రైలు రెడీ

**హైదరాబాద్ :** దక్షిణాదిన పుణ్య క్షేత్రాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే దక్షిణాదిన ఉండే అనేక పుణ్య క్షేత్రాలకు నిత్యం దేశం నలుమూలల నుంచి ప్రజలు వచ్చి వెళుతుంటారు. అయితే దక్షిణ మధ్య రైల్వే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పింది. జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్ర పేరుతో ప్రత్యేక రైలును నడపనుంది. ఈ రైలు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును నడపనుంది. ఈ నెల 23వ తేదీన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమయ్యే గభారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు దక్షిణాదిన ఉన్న అనేక ఆలయాలను చుట్టివస్తుంది. ఈ ప్రత్యేక రైలు అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చిలోని రంగనాథస్వామి ఆలయం, తంజావూరులోని బృహదీశ్వర ఆలయాలను దర్శించుకునే వీలుంది. సికింద్రాబాద్ నుంచి బయలుదేరి జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు ఉ రేణిగుంట వంటి ముఖ్యమైన స్టేషన్లలో మార్గ మధ్యంలో ఇరువైపులా ప్రయాణికుల కోసం రైలు ఎక్కేందుకు వీలుంది. ఈ యాత్ర మొత్తం ఏడు రాత్రులు, ఎనిమిది రోజుల వ్యవధిలో సాగుతుంది. ఇందులో అన్ని ప్రయాణ సౌకర్యాలు (రైలు మరియు రోడ్డు రవాణాతో సహా), వసతి సౌకర్యం, బోజన వసతిని కూడా కల్పిస్తారు. తిరువణ్ణామలై –



అరుణాచలం ఆలయం రామేశ్వరం – రామనాథస్వామి ఆలయం మధురై – మీనాక్షి అమ్మన్ ఆలయం కన్యాకుమారి – రాక్ మెమోరియల్, కుమారి అమ్మన్ ఆలయం త్రివేంద్రం – శ్రీ పద్మనాభస్వామి ఆలయం తిరుచ్చి – శ్రీ రంగనాథస్వామి ఆలయం తంజావూరు – బృహదీశ్వర ఆలయం టూర్ ధర ఒక్కొక్కరికి స్లీపర్ క్లాస్ లో పథ్నాలుగువేలు, థర్డ్ ఏసీ టిక్కెట్ ధర 22,500 రూపాయలు, సెకండ్ ఏసీ టిక్కెట్ ధర 29,500 రూపాయలుగా నిర్ణయించారు. దక్షిణ మధ్య రైల్వే నుంచి ఈ రైలులో దక్షిణ భారతంలోని ఆలయాలను దర్శించుకునేందుకు టిక్కెట్లను బుక్ చేసుకోవాలంటే 9701360701, 9281030726, 9281030740, 9281495845 నంబర్లలో సంప్రదించవచ్చు.

# మేం పార్టీ మారలేదండి...




**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం వివాదాస్పదమైంది. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో బీఆర్ఎస్ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు అధికర కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీనిపై బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల ఎన్నిక రద్దు చేయాలని కోరింది. కోర్టు చర్య తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆదేశించింది. స్పీకర్ జాప్యం చేయడంతో బీఆర్ఎస్ నేతలు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీంతో సుప్రీం కోర్టు పార్టీ మారిన ఎమ్మెల్యేపై చర్యలకు గడువు విధించింది. దీంతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇటీవలే నోటీసులు జారీ చేశారు. దీంతో పది మంది ఎమ్మెల్యేలు తాజాగా స్పీకర్ నోటీసులకు వివరాణ ఇచ్చారు. అయితే విశేషం ఏమిటంటే పది మంది ఎమ్మెల్యేల్లో 8 మంది తాము పార్టీ మారలేదని వివరణ ఇవ్వడం ఇప్పుడు ఆశ్చరకరంగా మారింది.బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని ప్రతిపక్షం ఆరోపించింది. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం, వారిని అనర్హులుగా ప్రకటించాలని పిటిషన్లు దాఖలయ్యాయి. సుప్రీంకోర్టు గత జులై 31న తీర్పు ఇచ్చి, స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఆదేశాలు ఆలస్యాన్ని విమర్శించి, పార్లమెంట్‌కు ఈ విధానాన్ని పునర్విచారించాలని సూచించింది. ఫిబ్రవరి నుంచి నోటీసులు జారీ అయ్యాయి, ఇది రాజకీయ ఒత్తిడిని పెంచింది. ఈ కేసు రాష్ట్రంలో పార్టీ మార్పులకు ఆటంకం కల్పుతున్నట్లు కనిపిస్తోంది.ఎనిమిది మంది ఎమ్మెల్యేలు లిఖితపూర్వకంగా స్పీకర్‌కు సమాధానాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవడం నియోజకవర్గాల అభివృద్ధి కోసమేనని, పార్టీ సభ్యత్వం మారలేదని చెప్పారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, గూడెం మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీ వంటివారు బీఆర్ఎస్ సూత్రాలకు నిబద్ధులమని పేర్కొన్నారు. కొందరు తమ ఫొటోలను మార్ఫింగ్ చేశారని, సీఎంతో కలయికలు గౌరవార్థమేనని వివరించారు. ఇక దానం నాగేందర్, కడియం శ్రీహరి మాత్రం మరిన్ని రోజులు కావాలని కోరారు. 8 మంది ఎమ్మెల్యేకు ఇందుకు ఆధారాలు కూడా చూపించారు. స్పీకర్ వాటిని ఫిరాయింపు ఆరోపణలు చేసినవారికి పంపారు.కొందరు ఎమ్మెల్యేలకు ప్రభుత్వ పదవులు లభించాయి. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వ్యవసాయ సలహాదారు పాత్ర, అరికెపూడి గాంధీకి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ స్థానం ఇచ్చారు. ఇది బీఆర్ఎస్‌లో ఆగ్రహాన్ని రేకెత్తించింది. గతంలో అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసి, పార్టీలో బ్రోకర్లు ఉన్నారని అన్నారు. కానీ ఇప్పుడు బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెప్పడం మాట మార్పుగా కనిపిస్తోంది. పాడి కౌశిక్‌రెడ్డి వంటి నాయకులు సవాల్ విసిరారు. ఈ పదవులు ఫిరాయింపు ఆరోపణలను మరింత బలపరుస్తున్నాయి, ఎందుకంటే అవి ప్రతిపక్షాలకు కేటాయించాల్సినవి.స్పీకర్ ప్రసాద్ కుమార్ ఒక్కొక్కరినీ విచారించనున్నారు. బీఆర్ఎస్ ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, న్యాయవాదులు హాజరుకావాలి. విచారణలు ఆలస్యం చేయకుండా చూడాలని స్పీకర్ హెచ్చరించారు. ఈ ప్రక్రియ బీఆర్ఎస్‌కు ప్రయోజనం కలిగించవచ్చు, ఎందుకంటే ఫిరాయింపులు ఆగిపోయాయి. మొత్తంగా, ఈ కేసులు తెలంగాణలో రాజకీయాలను మార్చవచ్చు. అనర్హత తీర్పు వచ్చిన తర్వాత ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇది కాంగ్రెస్ ఆధిపత్యాన్ని పరీక్షిస్తుంది. రాజ్యాంగపరమైన బాధ్యతలు, రాజకీయ అవకాశవాదం మధ్య సమతుల్యత అవసరమని ఈ సంఘటనలు సూచిస్తున్నాయి.


# కాన్ క్లేవ్ పేరుతో వైట్ కాలర్ దోపిడీ

**హైదరాబాద్ :** రాజకీయ నాయకులు ప్రచారాన్ని కోరుకుంటారు. నిత్యం వార్తల్లో ఉండాలని అనుకుంటారు. తమ గురించి మాత్రమే మీడియా గొప్పగా చెప్పాలని.. తమకు నచ్చని వారిపై నిత్యం రాళ్లు వేస్తూ ఉండాలని.. బురద కుమ్మరిస్తూ ఉండాలని అనుకుంటారు. సహజంగా రాజకీయ నాయకులు కూడా మనుషులే కాబట్టి.. వారికి కూడా ఆశలు ఉంటాయి కాబట్టి తప్పులేదు. కానీ వారి మాదిరిగానే ప్రత్యర్థి నాయకులు కూడా అలానే ఆలోచిస్తారు కాబట్టి.. మీడియాకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుంది. ఒకరి గురించి చెప్తే మరొకరు బాధపడతారని నిశ్శబ్దంగా ఉంటుంది. అయితే నేటి కాలంలో రాజకీయ నాయకులు ఆరి తేరి పోయారు కాబట్టి సొంతంగా మీడియా వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరైతే పరోక్షంగా మీడియా వ్యవస్థలను నడిపిస్తున్నారు.గతంలో పత్రికలను మాత్రమే నాయకులు మేనేజ్ చేసేవారు. కొంతకాలానికి న్యూస్ చానల్స్ వచ్చాయి. ఇప్పుడు సోషల్ మీడియా గ్రూపులు అదనంగా జత కూడిపోయాయి. ఆయనప్పటికీ రాజకీయ నాయకులకు ప్రచార యావ తగ్గడం లేదు. పైగా తమ మాటలను మాత్రమే ప్రజలు వినాలి అని కోరిక వారిలో అంతకంతకు పెరిగిపోతోంది. రాజకీయ నాయకుల ప్రచార పిచ్చిని కొన్ని మీడియా సంస్థలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. అయితే చేసేది ఎలాగూ వైట్ కాలర్ దోపిడీ కాబట్టి మీడియా అధినేతలు దానికి సరికొత్త పేరు పెడుతున్నారు.విదేశాలలో ఎన్నికలు జరిగినప్పుడు పోటీలో ఉండే ఇద్దరు నాయకులను ఒకే వేదిక మీద తీసుకొస్తారు. అక్కడ ఉన్న పాత్రికేయులు రకరకాల ప్రశ్నలు అడుగుతారు. దానికి ఆ ఇద్దరు నాయకులు సమాధానాలు చెప్తారు. ఇందులో ఎటువంటి మీడియా స్వార్థం ఉండదు. పెయిడ్ భజన అంతకంటే ఉండదు. కాకపోతే ప్రజలకు వాస్తవాలు తెలిసే అవకాశం ఉంటుంది. కానీ మన దేశంలో ఎన్నికలు లేకున్నా.. ఏదో జరిగిపోతోంది అనే భ్రమను కల్పించడంలో మీడియా ఆరి తేరిపోయింది. పైగా దానికి కాన్ క్లేవ్ అని పేరు పెట్టి.. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులను పిలుస్తోంది. పేరుకు భవిష్యత్తు కాలంలో దేశం పరిస్థితి ఏమిటి? రాష్ట్రాల పరిస్థితి ఏమిటి? అని చెబుతుంది. కానీ అంతర్గతంగా మాత్రం పెయిడ్ భజన. ఒక ముక్కలో చెప్పాలంటే అధికార పార్టీ దగ్గర కొంత.. ప్రతిపక్ష పార్టీ దగ్గర కొంత డబ్బులు తీసుకొని.. మీరు మంచివారే.. వారు కూడా మంచివారే.. వెరసి మనమంతా మంచివారమే అనే సందేశాన్ని ఓట్లు వేసిన ప్రజలకు ఇస్తుంది.ఎన్నో మీడియా సంస్థలు కాన్ క్లేవ్ లు నిర్వహించాయి. ఇంతవరకు అధికార పార్టీ చేసిన తప్పులను గాని.. ప్రతిపక్ష పార్టీ చేసిన అన్యాయాలను గాని వెలుగులోకి తీసుకురాలేకపోయాయి. న్యూట్రల్ గా ఉండాల్సిన మీడియా హౌస్ లోకి ఒక రాజకీయ నాయకుడు ప్రవేశించాడు అంటేనే దాని వెనుక ఏం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. స్థూలంగా చెప్పాలంటే ఒకప్పుడు రాజకీయ నాయకుల నుంచి యాడ్స్ తీసుకునేవారు. ఆ తర్వాత పెయిడ్ ప్రమోషన్ మొదలుపెట్టారు. ఇప్పుడేమో కాన్ క్లేవ్ లు నిర్వహిస్తున్నారు. పేర్లు మాత్రమే తేడా.. చేసే వైట్ కాలర్ దోపిడీ మాత్రం ఒకటే.

# లిక్కర్ కేసు మాజీ మంత్రికి బిగుస్తున్న ఉచ్చు

విజయవాడ : ఏపీ లిక్కర్ స్కాం దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసీపీ సీనియర్ నేత నారాయణస్వామి మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపేందుకు ఏసీబీ కోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) అనుమతి మంజూరు చేసింది. ఈ పరిణామంతో ఈ కేసు విచారణ మరింత వేగవంతమైంది.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా పనిచేసిన నారాయణస్వామి పాత్రపై సిట్ అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే ఒకసారి ఆయన్ను విచారించిన అధికారులు, ఆయన ఫోన్‌లో స్కామ్‌కు సంబంధించిన కీలక సమాచారం ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఫోన్‌ను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి (ఎఫ్ఎస్ఎల్) పంపి, పూర్తిస్థాయి డేటాను విశ్లేషించాలని నిర్ణయించారు. దీనికి న్యాయస్థానం నుంచి కూడా అనుమతి లభించడంతో దర్యాప్తులో ఇది కీలక ముందడుగుగా భావిస్తున్నారు.మరోవైపు, సిట్ అధికారులు కేవలం ఫోన్ డేటాతోనే సరిపెట్టకుండా నారాయణస్వామి కాల్ డేటా రికార్డులు, ఆయన బ్యాంకు ఖాతాల ద్వారా జరిగిన లావాదేవీలపై కూడా లోతుగా ఆరా తీస్తున్నారు. ఎఫ్ఎస్ఎల్ నుంచి రాబోయే నివేదిక ఈ కేసు దర్యాప్తులో అత్యంత కీలకం కానుందని, అందులో లభించే ఆధారాలను బట్టి తదుపరి చర్యలు ఉంటాయని తెలుస్తోంది. ఈ నివేదిక కోసం సిట్ అధికారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## అవరాపన్' సీక్వెల్‌లో దిశా పటాని ఫిక్స్....?



బాలీవుడ్ యంగ్ బ్యూటీ దిశా పటాని గత ఏడాది 'కల్కి'తో సూపర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం వరుస అవకాశాలు అందుకుంటూ ఫుల్ ఫామ్‌లో ఉంది. ఈ అమ్మడు వెల్‌కమ్ టూ ది జంగిల్, మలంగి-2, సంఘమిత్ర వంటి చిత్రాల్లో కనిపించబోతుంది.
షూటింగ్స్‌లో పాల్గొంటూ ఫుల్ బిజీ అయిపోయింది. ఈ క్రమంలో.. తాజాగా,దిశా పటాని ఓ బంపర్ ఆఫర్ అందుకున్నట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ హాట్ బ్యూటీ 'అవరాపన్-2'లో హీరోయిన్‌గా కనిపించనున్నట్లు టాక్. ఈ మూవీ స్టోరీ చిత్రబృందం దిశా పటానికి చెప్పగా.. అది నచ్చడంతో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. ఇందులో ఇమ్రాన్ హష్మీ హీరోగా నటిస్తున్నాడు. అయితే ఈ సినిమా 'అవరాపన్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతుండటంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రేమ, భావోద్వేగాలతో 'అవరాపన్-2' రాబోతుండగా.. నితిన్ కక్కర్, ముఖేష్ భట్ తెరకెక్కిస్తున్నారు. విశేష్ భట్ నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ అక్టోబర్‌లో ప్రారంభం కానుండగా.. జనవరి నాటికి పూర్తి చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 3న థియేటర్స్‌లోకి రాబోతుంది.

## మంచి ఛాన్స్ మిస్సవుతున్న పవన్!



'బాహుబలి' తర్వాత పాన్ ఇండియా స్థాయిలో వెలిగిపోవాలని ప్రతి స్టార్ హీరో ఆశపడ్డవాడే. కానీ అందరికీ కాలం కలిసి రాలేదు. పాన్ ఇండియా లేబుల్ వేసుకుని వచ్చిన చాలా సినిమాలు దారుణమైన ఫలితాలు అందుకున్నాయి. కొన్ని చిత్రాలకూ దేశవ్యాప్తంగా అనూహ్యమైన ఆదరణ దక్కి హీరోలకు ఊహించని ఫాలోయింగ్ వచ్చింది. రాజకీయాల్లోకి వెళ్లాక సినిమాల మీద ఫోకస్ తగ్గించినప్పటికీ ఆయన కొన్ని పాన్ ఇండియా ప్రయత్నాలు చేశారు. సర్దార్ గబ్బర్ సింగ్, హరిహర వీరమల్లు చిత్రాలతో తెలుగేతర భాషల వాళ్లనూ ఆకట్టుకోవాలని చూశారు.
కానీ ఆ సినిమాల్లో కంటెంట్ బలంగా లేకపోవడంతో పాన్ ఇండియా రిలీజ్ నామమాత్రం అయింది. తెలుగు రాష్ట్రాల్లోనూ సరిగా ఆడని ఈ చిత్రాలు.. మిగతా చోట్ల ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాయి. ఐతే పవన్ పాన్ ఇండియా లాంచింగ్‌కు సరైన సినిమా చేతిలో ఉన్నప్పటికీ.. ఇప్పుడు ఆ దిశగా ప్లానింగ్ సరిగా లేకపోవడం అభిమానులను నిరుత్సాహానికి గురి చేస్తోంది. ఓజీ.. పవన్ కెరీర్లోనే అత్యధిక హైప్‌తో వస్తున్న సినిమా. ఈ సినిమా కోసం అభిమానులు ఊగిపోతున్నారు. యుఎస్‌లో ఈ సినిమాకు రెండు వారాల ముందే అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేశారు. ఆల్రెడీ ఈ చిత్రం మిలియన్ మార్కును దాటేసింది. కల్కి, పుష్ప లాంటి చిత్రాల కంటే వేగంగా ఆ మార్కును అందుకుంది చిత్రం. తెలుగు రాష్ట్రాల్లో బుకింగ్స్ ఓపెన్ చేసినా రచ్చ మామూలుగా ఉండదని అర్థమవుతోంది. ఈ సినిమా ప్రోమోలు చూసి ఇతర భాషల వాళ్లు కూడా ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. కానీ 'ఓజీ' పాన్ ఇండియా రిలీజ్ విషయంలో మేకర్స్ అంత సీరియస్‌గా ఉన్నట్లు లేరు. ఇతర భాషల్లో అసలు ప్రమోషన్ అన్నదే లేదు. హిందీలో చాలా లిమిటెడ్ రిలీజ్ ఉండబోతోంది సినిమాకు. ఓటీటీ విండో 8 వారాల్లోపు ఉండడంతో నార్త్ మల్టీప్లెక్సులు ఈ సినిమాను ప్రదర్శించబోవు.

# అనుష్క ఏదో ఒకటి తేల్చేయాలి



తాను బయట కనిపించకపోయినా పర్లేదు తెరమీద దర్శనమిస్తే చాలు టికెట్లు కొనే జనాలున్నారన్న అనుష్క అంచనాలను ఘాటీ పూర్తిగా మాయం చేసింది. వచ్చిన కాసిన్ని ఓపెనింగ్స్ ఆమె ఖాతాలోకే వేసినా అవి కూడా మరీ తీసికట్టుగా ఉండటం ఆలోచించాల్సిన విషయం. ఆచార్య, ఆఫీసర్, రూలర్ లాంటి డిజాస్టర్లతో పోలుస్తున్నారంటే సినిమా ఏ స్థాయిలో ఆడిందో అర్థం చేసుకోవచ్చు. ఆడియో రూపంలో స్వీటీ చేసిన పబ్లిసిటీ వల్ల ఏ ఉపయోగం కలగలేదు. ఇప్పుడు తన నుంచి వస్తున్న నెక్స్ట్ మూవీ మలయాళంలో తీసిన కథనర్. ఇది పీరియాడిక్ డ్రామా. తెలుగులోనూ డబ్బింగ్ చేసి సమాంతరంగా వదులుతారు.ఇక అనుష్క ఏదో ఒకటి తేల్చుకునే టైం అయితే వచ్చేసింది. సినిమాలు కొనసాగించాలంటే స్పీడ్ పెంచాలి. నాలుగు పదుల వయసు వచ్చినా ఇంకా పెళ్లి చేసుకోకపోవడం తన వ్యక్తిగత విషయం. ఆ మాటకొస్తే త్రిష లాంటి వాళ్ళు కూడా ఈ క్లబ్బులో ఉన్నారు. ఇప్పటికీ చేతి నిండా నాలుగైదు సినిమాలతో ఆమె బిజీగా ఉంది. కానీ అనుష్క సంగతి వేరు. మీడియా కెమెరాల ముందుకు రావడం లేదు. తన రూపం కోసం ఆలా చేస్తోందా లేక ఇంకేమైనా కారణాలున్నాయా అనేది తెలియలేదు, ఇకపై తన దగ్గరికి వచ్చే కథలు, దర్శకులను వెయిట్ చేయించకుండా త్వరగా నిర్ణయాలు తీసుకుంటే కెరీర్ బాగుటుంది. ఘాటీలో అనుష్క మరీ బ్యాడ్ గా అనిపించలేదు. కొంచెం బొద్దుగా ఉన్నా చూడబుల్ గా ఉంది. కొన్ని సీన్స్ లో బాగా పెర్ఫార్మ్ చేసింది కూడా. అలాంటప్పుడు రెగ్యులర్ గా చేస్తూ ఉంటే ఆడియన్స్ తో కనెక్టివిటీ ఉంటుంది. ఎక్కువ గ్యాప్ తీసుకున్నా పాత స్థాయిలో ఆదరణ దక్కించుకునే వెసులుబాటు హీరోయిన్లకు ఉండదు. ఎనిమిదేళ్ళు మేకప్ కి దూరంగా ఉన్నా చిరంజీవిని ఆదరించిన జనం విజయశాంతిని అదే స్థాయిలో రిసీవ్ చేసుకోలేకపోయారు.

# ది మోస్ట్ లక్కీ డైరెక్టర్




ఇండస్ట్రీలో హీరోకైనా ఇంకెవరికైనా మార్కెట్ ని కొలిచేందుకు సక్సెసే ప్రామాణికం. ఇది ఉంటేనే జనంలో ఆసక్తి ఉంటుంది, బయట మంచి రేట్ పలుకుతుంది. వరస ఫ్లాపుల్లో ఉన్నప్పుడు ఎవరైనా దూరంగా ఉండటం సహజం. వివి వినాయక్, ముప్పలనేని శివ లాంటి ఒకప్పటి బ్లాక్ బస్టర్ డైరెక్టర్లు ఇప్పుడెందుకు సినిమాలు తీయడం లేదంటే నిర్మాతలు ముందుకు రాకపోవడమే. కానీ శ్రీను వైట్ల సుడి బ్రహ్మాండంగా ఉంది. ఈయన నుంచి చివరిగా వచ్చిన చెప్పుకోదగ్గ చిత్రం బాద్షా. 2013లో రిలీజైన ఈ జూనియర్ ఎన్టీఆర్ బొమ్మ రికార్డులు బద్దలు కొట్టలేదు కానీ కమర్షియల్ గా వర్కౌట్ అయిపోయి నిర్మాతను సేఫ్ చేసింది.దీని తర్వాత శ్రీను వైట్ల మళ్ళీ తన స్థాయి మేజిక్ చేయలేదు. ఆగడు, బ్రూస్ లీ, మిస్టర్, అమర్ అక్బర్ ఆంటోనీ వరసగా ఒకదాన్ని మించి మరొకటి చాలా చేదు ఫలితాలను చూశాయి. దెబ్బకాయన ఏకంగా ఎనిమిదేళ్ల గ్యాప్ తీసుకుని గత ఏడాది గోపీచంద్ విశ్వంతో రీ ఎంట్రీ ఇచ్చాడు. ఏదో ప్రమోషన్లలో హడావిడి చేశారు కానీ ఇది కూడా హిట్టు కిందకు రాదు. కొన్ని సెంటర్స్ లో ఓ మోస్తరుగా ఆడింది కానీ మరీ టీమ్ చెప్పుకున్నంత నెంబర్లు రాలేదు. కట్ చేస్తే ఇప్పుడు నితిన్ కాంబోలో శ్రీను వైట్లకో సినిమా సెట్ కావడం ఆశ్చర్యం కలిగించే విషయం. అది కూడా మైత్రి లాంటి బడా బ్యానర్ అంటే మాటలు కాదు. ఈ అవకాశాన్ని శ్రీను వైట్ల సంపూర్ణంగా వాడుకోవాలి. ఇన్ సైడ్ టాక్ ప్రకారం ఈసారి చాలా మంచి సబ్జెక్టు రాసుకున్నారట. మొత్తం తానే కాకుండా యంగ్ రైటర్లను పెట్టి డిఫరెంట్ గా అనిపించే స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నారని తెలిసింది.
వరస ఫ్లాపుల్లో ఉన్నప్పుడు ఎవరైనా దూరంగా ఉండటం సహజం. వివి వినాయక్, ముప్పలనేని శివ లాంటి ఒకప్పటి బ్లాక్ బస్టర్ డైరెక్టర్లు ఇప్పుడెందుకు సినిమాలు తీయడం లేదంటే నిర్మాతలు ముందుకు రాకపోవడమే.

# మళ్లీ హీరోగా సునీల్ సినిమా




ఒక సమయంలో బ్రహ్మానందంను కూడా వెనక్కి నెట్టి టాలీవుడ్లో నంబర్ వన్ కమెడియన్‌గా ఒక వెలుగు వెలిగాడు సునీల్. కానీ 'అందాల రాముడు'తో అనుకోకుండా హీరోగా మారి హిట్టు కొట్టిన అతను.. ఆ తర్వాత పూల రంగడు, మర్యాద రామన్న చిత్రాలతోనూ విజయాలు అందుకోవడంతో కామెడీ వేషాలు వదిలేసి సీరియస్‌గా హీరో వేషాల మీదే ఫోకస్ పెట్టాడు. కానీ ఈ ఆలోచనే ఒక దశలో తన కెరీర్‌ను ప్రశ్నార్థకం చేసింది. హీరోగా వరుసగా ఫెయిల్యూర్లు ఎదుర్కొని రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది తన పరిస్థితి. దీంతో ఒక దశ దాటాక హీరో వేషాలు వదిలేసి మళ్లీ కామెడీ ట్రై చేశాడు. అవి వర్కవుట్ కాకపోతే క్యారెక్టర్, విలన్ వేషాల వైపు మళ్లాడు. అవి కొంతమేర క్లిక్ అయి ఇప్పుడు తన కెరీర్ బాగానే నడుస్తోంది. ఐతే సునీల్‌ను ఇక మళ్లీ హీరో వేషాల్లో చూడలేమనే అంతా అనుకుంటున్న సమయంలో అతను లీడ్ రోల్‌లో ఒక సినిమా చేస్తున్న విషయాన్ని నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ వెల్లడించారు. తమ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బేనర్లో తెరకెక్కుతున్న కొత్త చిత్రాల గురించి వివరిస్తూ.. సునీల్‌తో 'మర్యాద కృష్ణయ్య' అనే సినిమా గురించి ప్రస్తావించారు విశ్వప్రసాద్. ఈ ఏడాదే ఆ సినిమా రిలీజవుతుందని కూడా ఆయన ప్రకటించారు. ఐతే ఇదేమీ కొత్త చిత్రం కాదు. నాలుగేళ్ల కిందట ఈ సినిమాను అనౌన్స్ చేశారు. 'మర్యాద రామన్న'లో సునీల్‌కు జోడీగా నటించిన సలోనినే ఇందులో కూడా హీరోయిన్. 'మనసంతా నువ్వే' దర్శకుడు వి.ఎన్.ఆదిత్య ఈ చిత్రాన్ని రూపొందించాడు. ఈ మూవీ షూటింగ్ ఎప్పుడో పూర్తయింది. కానీ ఏవో కారణాలతో విడుదల కాలేదు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ చిన్న బేనర్‌గా ఉన్నపుడు వేరే నిర్మాతలతో కలిసి ఈ సినిమాను ప్రొడ్యూస్ చేశారు విశ్వప్రసాద్.

## షారూఖ్, దీపికాకు భారీ ఊరట.. ముందస్తు బెయిల్ మంజూరు



బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్, స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణెలకు భారీ ఊరట లభించింది. సెక్యూరిటీ ఫీచర్స్ లేని ఓ కారు కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తురంటూ నమోదైన కేసులో రాజస్థాన్ హైకోర్టు వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. వివరాల్లోకి వెళితే.. రాజస్థాన్ రాష్ట్రంలోని భరత్‌పూర్ ప్రాంతానికి చెందిన అడ్వొకేట్ కీర్తి సింగ్ హ్యూందాయ్ కారును కొనుగోలు చేశారు. అయితే, కొన్న కారులో చాలా డిఫెక్ట్స్ ఉన్నాయని, తాను బ్రాండ్ అంబాసిడర్లను చూసే కారును కొనుగోలు చేశానని, తనకు న్యాయం చేయాలంటూ కీర్తి సింగ్.. షారూఖ్ ఖాన్, దీపికా పదుకొణెతో మరో ఆరుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదైంది. తాజాగా, బాధితురాలు ఇటీవలే రాజస్థాన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఆ పిటిషన్‌పై హైకోర్టు ధర్మాసనం ఇవాళ విచారణ చేపట్టింది. సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్ షారూఖ్ ఖాన్ తరఫున వాదిస్తూ.. తన క్లయింట్ షారూఖ్ ఖాన్‌కు ఈ కేసుతో నేరుగా ఏమాత్రం సంబంధం లేదని వాదించారు. పటిషనర్ ఆరోపించిన డిఫెక్టులకు అతడు బాధ్యత వహించలేడని తెలిపారు.

## అందురూ నన్ను సూపర్ హీరో అని పిలుస్తుంటే గర్వంగా ఉంది



మలయాళ యంగ్ బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్ ఇటీవల 'లోకా చాప్టర్-1 చంద్ర' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది.మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ మూవీ విమర్శలు అనుకున్నప్పటికీ భారీ కలెక్షన్లు రాబడుతూ బాక్సాఫీసును షేక్ చేస్తోంది. ఈ క్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కళ్యాణి ప్రియదర్శన్ ఎమోషనల్ కామెంట్స్ చేసింది. "అందరు నన్ను ఫిమేల్ సూపర్ హీరో అని పిలుస్తుంటే చాలా సంతోషంగా అనిపిస్తుంది. నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నా. నాకు చాలా గర్వంగా ఉంది. 'లోకా చాప్టర్-1' విజయం సాధించడానికి మా టీమ్ అంతా చాలా కష్టపడ్డాం. నేను ఈ సినిమాకు సైన్ చేసినప్పుడు ఇంత విజయం సాధిస్తుందని ఊహించలేదు. మంచి కథలో భాగం కావాలని అనుకున్నాను. ఈ సినిమా మొత్తాన్ని నా భుజాలపై వేసుకొని మోసానంటూ అందరూ అభినందిస్తున్నారు. కానీ మా టీమ్ అంతా ఆడ, మగ తేడా లేకుండా కష్టపడ్డారు. 'లోక చాప్టర్-1' మొదటి ఫిమేల్ సూపర్ హీరో సినిమా కావడం వల్ల ఎంతోమంది స్ఫూర్తి పొందుతున్నారు. హీరోయిన్స్ కూడా ఎలాంటి పాత్రలోనైనా నటించగలరని నమ్ముతున్నారు" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com